భర్త చావుకు
తనే కారణమన్న
సమాజాన్ని తట్టుకొని
ఆమె నిలబడిందా?

# జ్ఞాపకాలు

కాకాని కమల కథ

హాస్పటల్‌లో జనరల్ వార్డ్‌లో బెడ్‌మీద క్లోరోఫాం మైకంతో పడివున్న హరిప్రియ నెమ్మదిగా కళ్ళు విప్పటానికి ప్రయత్నించింది. అయినా ఒకపట్టాన కనురెప్పలు విడివడటం లేదు. ఇసుక గుప్పినట్లు బరువుతో వాలిపోతున్నాయ్ .

క్లోరోఫాం క్రమంగా మత్తు దిగుతున్నా ఒళ్ళు మెదడు అంత బండబారినట్లు ఒక గాఢ సుషుప్తి... ఆ సుషుప్తిలో గంధర్వ గానంలా ఒక మధురమైన ఆలాపన ఆమె హృదయాన్ని అలౌకిక ఆనందంతో ఓలలాడిస్తుంది.

ఎక్కడిదా గానం?

ఎవరు ఆలపిస్తున్నారు?

హరిప్రియ అతి కష్టంతో కనురెప్పలు విప్పార్చుతూ మోచేతుల ఆసరాతో పడక మీంచి లేవబోయింది.

కాని...

సాధ్యం కాలేదు.

హాస్పిటల్ మందుల వాసన, క్లోరోఫాం మత్తైన ఘాటు, లీలగా నాసికా పుటల్ని సోకుతూంది.

కనువిప్పి చూడటానికి ప్రయత్నిస్తుంటే కారం జల్లినట్లు భగభగ మండుతున్నాయి.

రక్తానికి బదులు నీరు ప్రవహిస్తున్నట్లు శరీరం అలసత్వంతో జారిపోతూంది.

బ్రతికున్నశవంలో వుంది ఆమె పరిస్థితి.

వైరాగ్యాన్ని ఉసికొల్పే నిస్తేజమైన ఆ హాస్పటల్ వాతావరణంలో అంత అద్భుతమైన పాట ఏ మూల నుంచి వినిపిస్తోందో



తెలుసుకోవాలన్న ఆత్రంతో హరిప్రియ
ఆసక్తితో కళ్ళుతెరిచి
చూసింది.

ఆమె పక్క బెడ్ మీద వున్న

పేషంట్ ట్రాన్సిస్టరు చెవి దగ్గర పెట్టుకొని
మట్టూ తన్మయంగా కళ్ళు మూసుకుని పాట
వింటూంది.

"మనిషిపోతే మాత్రమేమి

మనసు వుంటది.

మనసుతోటి మనసెపుడో కలిసిపోతది..."

మధురంగా వస్తుంది పాట.

ఆ క్షణంలో ఆ పేషంట్ పొట్టకి వున్న పెద్ద బ్యాండేజీగాని, తలకి వున్న గాయం గాని ఆమెనేమి బాధించినట్టు లేదు.

సర్వం మరిచిపోయినట్లు ఆ పాట వినటంలో నిమగ్నం అయ్యింది.

ఆ పాటని వింటూ హరిప్రియ కళ్ళు మూసుకొని తిరిగి బెడ్‌మీద వాలింది.

ఆ కాస్త కదలికకే ఆమెకి గుండెలో అయాసంగా అనిపించి చెమట పట్టింది.

"మనిషిపోతే మాత్రమేమి మనసు వుంటది" అన్న ఆ కవిత్వం వెనక ఏదో సందేశం.

మూసుకున్న హరిప్రియ కనురెప్పల మాటు నుంచి చేదులాంటి గతం వేదనగా కదిలింది.

** ** **

హరిప్రియకి పెళ్ళయి సరిగ్గా ఏడాది అయ్యింది.

శ్రీహర్ష ఆమెని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు.

కాని శ్రీహర్ష తల్లితండ్రులకి ఆ పెళ్ళి ఇష్టం లేదు.

కట్న కానుకలు, పెద్దల ప్రమేయం లేకుండా కొడుకు స్వతంత్రించి భార్యని ఎంచుకోవటం వాళ్ళకి మనస్థాపాన్ని కలిగించింది.

అయినా—

స్వంతంత్రుడయిన కొడుకు ఇష్టాన్ని కాదనలేక హరిప్రియని కోడలుగా ఆహ్వానించక తప్పలేదు.

త్వరలో శ్రీహర్ష తండ్రి రిటైర్ కాబోతున్నాడు. ముందుముందు శ్రీహర్ష సంపాదనే వాళ్ళకి ఆధారం. పైగా ఇంటికి పెద్ద కొడుకు.

అందుకే కొడుకు మనసుపడ్డ అమ్మాయితోనే పెళ్ళి జరిపించారు.

అయితే ఆ నిస్సహాయత అంతా కోడలు మీద ద్వేషంగా మారింది.

శ్రీహర్ష ఇంట్లో లేనప్పుడు హరిప్రియని సూటిపోటిగా మాటలనడం, నిరాదరించటం, వేరేభావంతో చూడటం సాధించటం చేసేవారు అత్త ఆడబిడ్డలు.

సున్నిత మనస్కురాలైన ప్రియకి కొత్త కోడలుగా అత్తింటి కాపురం దుర్భరం అనిపించసాగింది.

రామరాను భార్యలో వచ్చిన మార్పుని ఇంటి వాతావరణాన్ని గమనించిన శ్రీహర్ష భార్యని ప్రేమగా ఓదార్చాడు. "అమ్మ పూర్వకాలంది. చదువు కోలేదు. చెల్లెళ్లు చిన్నవాళ్ళు. వాళ్ళే క్రమంగా మారుతారు. కొంచెం నువ్వే నాకోసం సర్దుకో ప్రియా కొన్నాళ్ళపాటు" అన్నాడు లాలనగా.

భర్తపై ప్రేమతో హరిప్రియ క్రమంగా అత్త ఆడబిడ్డల సాధింపులకి అలవాటు పడటానికి సర్దుకు పోవటానికి ప్రయత్నించసాగింది.

ఆరునెల్లు అలాగే ఆటు—పోటుతో గడిచాయి.

హరిప్రియ నెలతప్పింది. ఐదవనెల రాగానే పసుపుకుంకుమ చేసి తీసికొని వెడతానని తల్లి ఉత్తరం రాసింది.

హర్షప్రియకి ఏది రుచించటం లేదు. ఏం తినలేక పోతూంది. మనిషి కొంచెం చిక్కింది. ఇంటి పెద్ద కోడలు కావడంతో అంతో ఇంతో పనిభారం తప్పటం లేదు.

కాని తను తల్లి కాబోతున్నాననుకుంటె చాలా ఆనందంగా ఉంది.

ఆ రోజు...

అంటే సరిగ్గా పది రోజుల క్రితం.

శ్రీహర్ష ఉదయం పదిగంటలకి ఆఫీసుకి వెడుతూ హర్షప్రియని ప్రేమగా దగ్గరకు తీసుకొని చెప్పాడు.

"సాయంత్రం ఆఫీసునుంచి తొందరగా ఇంటికి వస్తాను. డాక్టరు దగ్గరకి వెడదాం. బలానికి ఏమన్నా టానిక్కులు రాసిమ్మని అడుగుదాం. అన్నట్లు అట్నుంచి అటే మంచి రెస్టారెంట్‌కి వెడదాం. నీకేం తినాలనుందో లిస్టు తయారు చేసుకో..." అన్నాడు నవ్వుతూ.

అత్తింటి కలివిడి కాపురం భార్య అచ్చట ముచ్చటా తీరడం లేదని తెలుసు. ఇద్దరూ సరదాగా మాట్లాడుకునేందుకు ఏకాంతం కూడా తక్కువే.

పోనీ సినిమాకో షికారుకో ప్రోగ్రాం పెట్టుకుంటే చెలెళ్ళు బయలుదేరుతారు. తల్లి అదే అదును ముందే వాళ్ళని అలంకరించి సిద్ధం చేస్తుంది.

అందుకే ఇప్పుడు హాస్పటల్ ఒంక పెట్టాడు.


భర్త ఆఫీసుకి వెడుతుంటే గేటు దాకా వచ్చి సాగనంపింది హర్షప్రియ. స్కూటర్ సందు మలుపు తిరిగాక సాయంత్రం ప్రోగ్రాం గురించి ఆలోచిస్తూ ఇంట్లోకి వచ్చింది.

అంతే!

అలా ఆఫీసుకని బయలుదేరి వెళ్ళిన శ్రీహర్ష మళ్ళీ ఇంటికి రాలేదు.

ఇంటి నుంచి బయలుదేరి వెళ్ళిన శ్రీహర్ష ఆఫీసు దాకావెళ్ళనే లేదు.

మధ్య దారిలోనే అతని స్కూటర్ హైవే ఒంపు దగ్గర పెద్ద ఆక్సిడెంటుకి



గురి అయ్యింది.

ఎదురుగా వస్తున్న లారి బ్రేకులు ఫేలయిన కారణాన కంట్రోలు తప్పి బలంగా శ్రీహర్ష స్కూటర్ని ఢీ కొంది.

అటు లారీ డ్రైవర్‌కి బలంగా దెబ్బలు తగిలి చావు బతుకుల మధ్య హాస్పిటల్ బెడ్ మీద వున్నాడు. అతడు బతికినా మెదడు పని చెయ్యదని, కాళ్ళు తీసెయ్యాలని డాక్టర్లు చెప్తున్నారు.

కాని శ్రీహర్ష నడిరోడ్డు మీద ఆక్సిడెంటు జరిగిన వారాక్షణం మరణించాడు.

అతని తల లారి కింద పడి గుర్తించటానికి వీలులేనంతగా చితికి పోయింది.

అందంగా హుషారుగా ఉండే అతడి దేహం క్షణాల్లో నామరూపాలు లేకుండా అయిపోయింది.

అతడి స్కూటర్ డిక్కీలో వున్న ఐడెంటిటి కార్డు చూసి పోలీసులు సమాచారం అందించారు. వార్త వింటూనే ఇంటిల్లిపాది పరిగెత్తారు.

పోలీసులు అతడి శవాన్ని పోస్టుమార్టం కోసం హాస్పటల్‌కి తరలించారు.

అతడి శవం బాగా చితికిపోయి నల్లగా కమిలిపోయింది. ఎంతో భయంకరంగా మారిపోయింది. అందాక దూరాన వున్న బంధువులు వచ్చే దాకా వుంచకుండా అతడి శవాన్ని అదే రోజు దహనం చేశారు.

అప్పటికి శ్రీహర్ష వయసు ఇరవై ఆరేళ్ళు.

[illegible] నూరేళ్ళు నిండిపోయ్యాయి.

శ్రీహర్ష తల్లి గుండెలు అలిసిపోయేలా కొడుకు శవం మీద పడి రోదిస్తుంటే రాళ్ళు కూడా కదిలిపొయ్యాయి అనిపించింది చుట్టూ చేరిన వారికి.

''మహమ్మారి ఏ క్షణంలో నా ఇంట్లో కాలుపెట్టిందో నా కొడుక్కి నూరేళ్ళు నిండిపొయ్యాయి. వాడిపాలిట ఈ పాపిష్టి పెళ్ళి పెటాకులు అయిపోయింది. మండిపోయిన ప్రేమ ప్రాణాలు తీసింది. ఇది కోడలు కాదు. నా ఇంటికి కొరివి...''

''కోడలు వచ్చిన వేళ గొడ్డు వచ్చిన వేళ అని వూరికే అంటారా?''

''జాతకం, నక్షత్రం చూసి మంచి పిల్లని తెచ్చి పెళ్ళి చేస్తారా నాయనా అన్న. కాదన్నాడు. ఎన్నడూ నా మాట జవదాటని నా బిడ్డ నా మాట కాదన్నాడు. ఈ మహమ్మారి ఏం మాయచేసిందో... వాణ్ని మింగేసింది''.

అత్తగారు మెటికలు విరుస్తు గుండెలు బాదుకుంటుంటే హరిప్రియ ప్రాణం వచ్చి పోయింది.

బంధుమిత్రుల ముందు తల ఎత్తుకోలేక పోయింది.

ఆవిడ అత్త అయితేనేంగాక, తనని శాపనార్థాలు పెడితేనేం గాక... ఆ తల్లి కడుపుశోకం చూడలేకపోయింది.

తనని ఎంతగానో ప్రేమించిన శ్రీహర్ష హఠాన్మరణం, కమిలిపోయిన అతని దేహం చూస్తుంటే నిజంగానే తనది పెద్దమ్మ పాదమేమో... అనిపించింది.

తన మీద తనకే విరక్తి కలిగింది.

కొడుకుని పోగొట్టుకున్న దుఃఖంతో అత్తింటి వారు తనని బద్ధ శత్రువుల్లా చూస్తుంటే, భర్తలేని అత్తింట్లో పది రోజులు పది

యుగాల్లాగ గడిచాయి.

తెల్లారితే పదికొండవ రోజు.

శ్రీహర్ష కర్మకాండలకి సన్నహాలు జరుగుతున్నాయి. తనకి ఆ తెల్లవారు ఝామున చాకలి దానిచేత జరిపించే తతంగం తెలుసు హర్షప్రియకి.

అత్తింటి వారితోపాటు తల్లి, చెల్లెళ్ళు కూడా తనని నిరసనగా చూడటం హర్షప్రియకి ఎంతో క్షోభని రగిలించాయి. కడుపులో జీవం పోసుకుంటున్న బిడ్డ శవంలాగా మోయలేని భారంగా అనిపించాడు.

మరో ఆలోచన లేకుండా బాత్‌రూమ్‌లో గూట్లో పైన వున్న ఎలకల మందు నీళ్ళల్లో కలుపుకుని తీసి నిశ్శబ్దంగా తన గదిలోకి వచ్చి మూలగా చాపమీద ముడుచుకుని పడుకుంది.

క్రమంగా మందు పని చెయ్యడం మొదలయ్యింది.

ఎంతసేపు గడిచిందో తెలియదు.

కాస్తలో ప్రాణం పోవాల్సిందే.

కాని సరిగ్గా అదే సమయానికి ఏదో పని మీద గదిలోకి వచ్చిన హర్షప్రియ చెల్లెలు చూసి గోలపెట్టటంతో నలుగురూ కూడి హాస్పటల్‌కి తెచ్చి పడేశారు.

సమయానికి వైద్య సహాయం అందటంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది హర్షప్రియ.

కాని ఆమె గర్భవతి కావటంవల్ల మరో రెండు రోజుల తరువాత డిస్చార్జి చేస్తానని చెప్పింది డాక్టరు.

అయితే ఇంత జరిగినా కడుపులో బిడ్డకి అపాయం ఏర్పడలేదు.


బిడ్డ పరిస్థితి ఆరోగ్యకరంగానే వుంది.

"తనలాగ తన బిడ్డ మొండి ఘటమేమో? పుట్టక ముందే ఎన్నో అపవాదులని ప్రాణ గండాలని భరిస్తున్నాడు" అనుకుంది వేదనగా.

ఆ బాధతో నిద్ర పట్టలేదు.

ఆ మర్నాడు రౌండ్సుకి వచ్చిన

## చవటు!



కోపంగా అన్నాడు భర్త.
"నేను చవటను గనుక నిన్ను పెళ్ళాడాను".
"నిజమేనండోయ్... ఆ ప్రేమ వేడిలో ఈ సంగతి గమనించలేకపోయాను".

– కె.వి.మధుసూధనరావు (కాకినాడ)

డాక్టరు హరిప్రియని మృధువుగా మందలించింది.

"ప్రియా! చావు పుట్టుకలు మన చేతుల్లో లేవు. చదువుకున్న దానివి. ఇలా ఆత్మహత్యకి పాల్పడట మేమిటి? రాత్రంతా ఏడుస్తూనే వున్నావని సిస్టర్ చెప్పింది. నీకు బాధలేదని నేనన్నా. కాని వాటికి ఏదురీదటం నేర్చుకోవాలి. కష్టాలు మనుషులకు కాక రాళ్ళకి వస్తాయా? ధైర్యంగా వుండు ఇంజక్షన్ ఇస్తాను. మంచి నిద్ర వస్తుంది. ఇప్పుడు నీకు కావల్సింది మందులు కాదు. మానసిక విశ్రాంతి" అంది.

హరిప్రియ దుఃఖ ఆపుకుంది.

చాలా రోజుల తరువాత అంత చల్లని ఓదార్పుకి మనసు కరిగినట్లు అయ్యింది.

"ఈ పరిస్థితిలో నాకు మనశ్శాంతి ఎలా దొరుకుతుంది డాక్టర్. నా భర్త మరణానికి నిజంగా నా నష్టజాతకమే కారణం కాదా?" అంది బేలగా.

డాక్టర్ జాలిగా చూసింది.

"అదంతా ఒట్టిమాట. అతని ఆయువు తీరింది. వెళ్ళిపొయ్యాడు. ఆ టైము వస్తే మనం అంతే. ఎవరి కర్మకు ఎవరు కర్తలు కారు.. నీ అత్త ఆడబిడ్డలు మాటలు పట్టించుకోకు. ఒక్కమాట చెప్పు భౌతికంగా నీ భర్త మరణించవచ్చు. కాని నీ మనసులో అతనిపై నీ ప్రేమ కూడా చచ్చిపోయిందా?"

"లేదు... లేదు..."

"మరింకేం? అతని బిడ్డ నీ కడుపులో పెరుగుతున్నాడు. వాడికి అన్యాయం చేస్తావా? నీ బ్రతుక్కి అర్థం లేదని ఎందుకనుకుంటున్నావు. పుట్టబోయే ఆ పసివాడు నీ బ్రతుక్కి అర్థం. నీకు తోడూ నీడా. నీ భర్త లేకపోయినా అతని ప్రేమకానుక నీకు ఉంది. కాదంటావా చెప్పు..."

డాక్టరు మృదువుగా మందలించి ఇంజక్షన్ చేసి వెళ్ళిపోయింది.

నిజమే.

డాక్టరు ఎంతచక్కగా చెప్పింది.

తన బిడ్డ అనాథ కావాలని, తన భర్త చనిపోవాలని తను కోరుకుందా. కాని విధి అలా జరిగిపోయింది. వీళ్ళంతా తనని ఎందుకు నిందలు వేస్తారు.

శ్రీహర్ష తన నుంచి దూరంగా వెళ్ళిపోవచ్చు. కాని అతని ప్రేమకానుక తన దగ్గర వుంది. ఆ కానుకని తను ధ్వంసం చేయబూనటం ఎంత అవివేకం? ఎంత పాపం? తన కోసం కాకపోయినా తనబిడ్డ కోసం అయినా తను బ్రతకాలి.

హరిప్రియ ప్రేమగా అరచేతిని పొట్ట దగ్గర స్పృశించింది. తల్లి స్పర్శకి పులకరిస్తున్నట్లు లోపలి బిడ్డ సన్నని కదలిక...

"చావు పుటుక లేనిదమ్మా నేస్తమన్నది
జనమ జనమకది మరి గట్టి పడతది..."

మత్తు ఇంజక్షన్ క్రమంగా శరీరాన్ని మైకంలోకి జారుస్తుంటే చెవులకి సోకుతున్న ఆ పాటకి మైమరుస్తున్నట్లు మగతలోకి జారింది హరిప్రియ.

●